

జల్సాలు చేసేందుకు నేరాలు

జల్సాలకు అలవాటు పడి బైకులను దొంగిలించిన యువకులను పోలీసులు పట్టుకున్నారు.

8లో



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.1°/16.6°

జిల్లా అంతటా గురువారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ప్రతి రైతు 'ఈ-క్రాప్' చేయించాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి రైతు 'ఈ-క్రాప్ బుకింగ్' తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం కళ్యాణదుర్గం డివిజన్‌లోని కంబదూరు, బెళుగుప్ప, శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులు త్వరపడాలన్నారు.ఈ క్రాప్ బుకింగ్‌తో కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయించాలన్నారు. ఆర్‌బీకేలలో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

12న పెన్షన్ అదాలత్

అనంతపురం సిటీ: ఈపీఎస్ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు కడప రీజినల్ పీఎఫ్ కమిషనర్ గౌరవ్ మహల్వాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వెబ్ వేదికగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లతో పాటు పెన్షనర్లు కాబోయే వారు తమ సమస్యలను https://meetingsapac19. webex.com/meetingsapac19/j.php?MTID=m804f957fdc331c6c6cb25afbfa563518, మీటింగ్ నంబర్: 2644 731 2127, పాస్‌వర్డ్: 12345. లింక్ ద్వారా తెలియజేయవచ్చని ఆయన సూచించారు.

గంజాయి సాగుకు కఠిన శిక్ష

- వ్యక్తికి నాలుగేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా



అనంతపురం: గంజాయి సాగు చేసినట్లు నిర్ధారణ కావడంతో ఓ వ్యక్తికి 4 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. అలాగే, రూ. 10 వేల జరిమానా విధించారు. ఈ మేరకు స్థానిక ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి టి. హరిత గురువారం సంచలన తీర్పు వెలువరించారు. ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ తెలిపిన మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలం ఎర్రగుంట పంచాయతీ నేతలపల్లికి చెందిన వై. నారాయణప్ప (48) తన పొలంలో అంతర పంటగా గంజాయి పెంచేవాడు. విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 2019 సెప్టెంబర్ 14న మడకశిర ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపవరం లక్ష్మీనారాయణ రెడ్డి కేసును వాదించారు. నారాయణప్ప గంజాయి మొక్కలు సాగు చేసినట్లు నిర్ధారణ కావడంతో జడ్జి హరిత గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడికి నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు.

బాధ్యతల స్వీకరణ



కమాండెంట్ అమిత్ బర్దర్‌కు స్వాగతం పలుకుతున్న బెటాలియన్ అధికారులు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా అమిత్ బర్దర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, పోలీసు అసోసియేషన్ సంఘం అధ్యక్షులు పెద్దయ్య, వైస్ ప్రెసిడెంట్, ఏఆర్ ఎస్ఐ శ్రీనివాసులు, కోశాధికారి మాదన్నలు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమాండెంట్ అమిత్ బర్దర్ మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కాగా, ఇటీవల కమాండెంట్‌గా పని చేస్తున్న గంగాధర్ రావు విజయవాడ సీఐడీ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. సీఐడీలో ఎస్పీగా పని చేస్తున్న అమిత్ బర్దర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇదేం ఖర్మ బాబూ!?



ఒంటరిగా వెళ్తే గెలవలేమని తేలిపోయింది. కనీసం ఓ వర్గం ఓట్లయినా లాక్కుందామనే దూరాశతో రోజుకో మాట మాట్లాడే ఆయన్ను పక్కన తెచ్చుకున్నారు. ఇంకా భయం పోలేదు. ''ఆవేశం రాదా అండీ?'' అంటూ ఒకప్పుడు ధ్వజమెత్తిన వారి వద్దకే కాళ్లబేరానికి సైతం వెళ్లిపోయారు. మీరెంతంటే అంతే, మీకివి.. మాకవి అంటూ దిగజారిపోయారు. ఆయన తీరేమో గానీ, ఇన్నాళ్లూ పార్టీ పల్లకీ మోసిన నేతల్లో మాత్రం కలవరం మొదలైంది. తమ సీటుకు ఎక్కడ ఎసరు పెడతారోనని లోలోనే కుమిలిపోతున్నారు. పొత్తుల కోసం అర్రులు చాస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవహార శైలిపై ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- బాబు కాళ్లబేరం..తమ్ముళ్ల గరంగరం
- బీజేపీ నేతలను కలవడంపై అసంతృప్తి
- ఇప్పటికే జనసేన పార్టీతో జతకట్టడంపై ఆందోళన
- తమ సీటుకు చిల్లు పడుతుందేమోననే భయం
- 40 ఇయర్స్ ఇండస్ట్రీ అంటే ఇదేనా అంటూ నిట్టూర్పు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పూటకో మాట.. రోజుకో నిర్ణయం చందాన చంద్రబాబు చేష్టలు ప్రజలను విస్మయానికి గురి చేస్తుండడమేమో గానీ, 'తమ్ముళ్ల'లో మాత్రం గుబులు రేపుతున్నాయి. 40 ఏళ్ల అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే ఆయన ఇప్పటికే జనసేనతో పొత్తు అంటూ వారిని పక్కలో బల్లెం లాగా కూర్చోబెట్టడంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తాజాగా బీజేపీతోనూ పొత్తు ఉంటుందన్న సంకేతాలు ఇవ్వడంపై మండిపడుతున్నారు. జాతీయ పార్టీల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని.. ఇప్పుడు మళ్లీ అవే పార్టీల పాదాల వద్ద మోకరిల్లేలా వ్యవహరిస్తుండడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు సీట్లు ఇస్తారని ప్రచారం

బీజేపీ, జనసేన పొత్తులు ఖరారైతే ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు సీట్లు ఆ రెండు పార్టీలకు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 2019లో టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయిన వరదాపురం సూరి.. పొత్తులో భాగంగా బీజేపీ నుంచి ధర్మవరంలో పోటీ చేసే అవకాశాలున్నాయి. మరోవైపు అనంతపురం అర్బన్ సీటు జనసేన కోరుతోంది. అయితే, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో ఉన్న జేసీ దివాకర్‌రెడ్డి తనయుడు పవన్ రెడ్డిని జనసేనలో చేర్పించి అనంతపురం నుంచి పోటీ చేయిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఏపార్టీలో ఉన్నా మనవాడే కదా అన్నది చంద్రబాబు ఆలోచన. దీనిపై మిగతా నాయకులు ససేమిరా అంటున్నారు. వరదాపురం సూరికి టికెట్ ఇస్తామనడంపై పరిటాల వర్గం భగ్గుమంటోంది. అలాగే పవన్‌రెడ్డికి జనసేన టికెట్ అనడంపై ఇక్కడ వైకుంఠం ప్రభాకర్ చౌదరి ససేమిరా అంటున్నారు. కేసుల నుంచి బయటపడేందుకు చంద్రబాబు బీజేపీతో అంటకాగుతున్న తీరు కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తోందని కళ్యాణదుర్గం టీడీపీ నాయకుడొకరు వాపోయారు.

ఓట్లే లేనప్పుడు సీట్లు ఎందుకు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇందులో ఎక్కడా జనసేన ప్రభావం నామమాత్రంగా కూడా లేదు. అయితే చంద్రబాబు ఏ సభ నిర్వహించినా చోటామోటా జనసేన నేతలకు సభలో పెద్దపీట వేయాల్సి వస్తోంది. దీన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పట్టుమని 10 ఓట్లు లేని వారు కూడా స్టేజీపై దర్జాగా కూర్చోవడంతో రగిలిపోతున్నారు. ఇక ఇప్పుడు బీజేపీతోనూ పొత్తు అంటే తమ పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. వారికి ఓట్లే లేనప్పుడు పొత్తు పెట్టుకుని సీట్లు ఇవ్వాల్సిన అవసరం ఉందా అంటున్నారు. చంద్రబాబు దిగజారి వ్యవహరిస్తున్నారా లేదా పార్టీ పరిస్థితి పాతాళానికి వెళ్లిందా అన్నది అర్థం కావడం లేదని పుట్టపర్తికి చెందిన ఒక సీనియర్ టీడీపీ నేత వ్యాఖ్యానించారు.

గుత్తి డీజిల్‌షెడ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



గుత్తి డీజిల్ లోకోషెడ్ (ఫైల్)

గుంతకల్లు: గుత్తి డీజిల్ లోకో షెడ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ పరంగా దక్షిణ మధ్య రైల్వే డివిజన్ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు గురువారం డీఆర్ఎం వినీత్‌సింగ్ తెలిపారు. కాజీపేట డీజిల్ లోకోషెడ్ మొదటి స్థానంలో ఉందన్నారు. గుత్తి డీజిల్ లోకోషెడ్‌లో దాదాపు 90 డబ్ల్యూ, ఏజీ-9 ఎలక్ట్రిక్ లోకోలు ఉండగా, డివిజన్ వ్యాప్తంగా దాదాపు 90 శాతం విద్యుదీకరణ పూర్తి చేసి డీజిల్ ట్రాక్షన్‌తో నడిచే రైలు సర్వీసులను దశలవారీగా విద్యుత్ ట్రాక్షన్‌తో నడుపుతున్నట్లు డీఆర్ఎం వెల్లడించారు. ఈ విషయంలో అతి తక్కువ వైఫల్యాలు కలిగి ఉండడంతో జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. త్వరలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా పురస్కారంతో పాటు నగదు బహుమతి అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

12న అప్రెంటిస్‌షిప్ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఒకేషనల్ విద్యార్థుల కోసం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్య అధికారి వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, గతేడాది ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అన్ని మేనేజ్‌మెంట్ల కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఒకేషనల్ లెక్చరర్లు తప్పనిసరిగా సమాచారం చేరవేసి హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

పునాది లేని దేవాలయం లేపాక్షి ఒక్కటే

- యునెస్కో గుర్తింపు కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం
- ఇంటాక్ చైర్మన్ ఎల్‌కే గుప్తా



మాట్లాడుతున్న ఇంటాక్ చైర్మన్ ఎల్‌కే గుప్తా

లేపాక్షి: దేశంలోనే ఎక్కడా లేని విధంగా పునాది లేని దేవాలయం లేపాక్షి ఒక్కటేనని ఇంటాక్ (అఖిల భారత కళలు, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ ట్రస్టు) చైర్మన్ ఎల్‌కే.గుప్తా తెలిపారు. పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయంలో ఉన్న పెయింటింగ్స్ (చిత్రలేఖనాల)ను భారతీయ శాస్త్రీయ పద్ధతుల్లో శుభ్రపరచాలని కోరారు. లేపాక్షి ఆలయాన్ని గురువారం ఇంటాక్ చైర్మన్‌తో పాటు అనంతపురం జిల్లా కన్వీనర్ రామ్‌కుమార్, కోకన్వీనర్ చంద్రహాసరెడ్డి, పూర్వ కన్వీనర్ ఏజీ వేణుగోపాల్, పురావస్తు, మ్యూజియం ఏడీ రజిత, ఇంటాక్ కెపాసిటి బిల్డర్ కృష్ణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేపాక్షి ఆలయంలో బ్రిటిష్ కాలం నాటి కాలంలో చిత్రీకరించిన చిత్ర లేఖనాలు కొంత వరకు మాసిపోయాయని, వాటిని ఇప్పుడు రసాయనిక పద్ధతుల్లో శుభ్రపరచడం వల్ల ప్రయోజనం లేదన్నారు. తమ ట్రస్ట్ ద్వారా ఒక చోట శాస్త్రీయ పద్ధతుల్లో పెయింటింగ్స్ వేసి చూపిస్తామని, ప్రభుత్వం నిధులు సమకూరిస్తే ఆలయంలో ఉన్న పెయింటింగ్స్ పూర్తి చేస్తామన్నారు.

వారసత్వ సంపదను పరిరక్షించుకుద్దాం

అనంతపురం కల్చరల్: వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇంటాక్ చైర్మన్ ఎల్‌కే గుప్తా అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన చరిత్ర కల్గిన లేపాక్షి ఆలయానికి యునెస్కో గుర్తింపు సాధనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఆయనను జిల్లా ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ నేతృత్వంలో పలువురు కవులు, రచయితలు ఘనంగా సత్కరించారు.

కొడుకును ఎత్తుకెళ్లి.. దొరికిపోయి

- 3 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: తల్లికి తెలియకుండా కన్నకొడుకును ఎత్తుకెళ్లిన ఓ తండ్రిని పోలీసులు 3 గంటల్లోనే పట్టుకున్నారు. డీఎస్పీ బి. శ్రీనివాసులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా బండమీదఅచ్చంపల్లికి చెందిన ముత్రాసి సంజీవరాయుడుకు, శెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన తిమ్మక్కకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలానికి మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకొన్నారు. అప్పటి నుంచి తిమ్మక్క తన కుమారుడు రంజిత్‌కుమార్‌తో కలిసి చిన్నంపల్లిలో నివాసం ఉంటోంది. కుమారుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం చిన్నంపల్లి వచ్చిన సంజీవ రాయుడు.. పిల్లవాడికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న తల్లి వెంటనే శెట్టూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన వారు నియోజకవర్గంలోని అన్ని మండలాల పోలీసులను అప్రమత్తం చేశారు. కంబదూరు చెక్‌పోస్టు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని తల్లికి అప్పగించారు. 3 గంటల్లోనే కేసును ఛేదించిన కళ్యాణదుర్గం రూరల్ ఎస్ఐ నాగరాజు, శెట్టూరు ఎస్ఐ రాంభూపాల్‌ను డీఎస్పీ అభినందించారు.

పరిశ్రమల స్థాపనతోనే సమగ్రాభివృద్ధి

- పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ''పరిశ్రమల స్థాపన ద్వారానే జిల్లా సమగ్రాభివృద్ధి సాధిస్తుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలి'' అని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్ విండో పోర్టల్‌లో గత ఏడాది నవంబరు, డిసెంబరు, ఈ ఏడాది జనవరిలో 75 దరఖాస్తులు రాగా 58 ఆమోదించారన్నారు. మిగిలిన దరఖాస్తులను త్వరితగతిన ఆమోదించాలని ఆదేశించారు. పీఎంఈజీపీ కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,037 దరఖాస్తులు వివిధ బ్యాంకులకు పంపామని, నిర్దేశించిన మేరకు యూనిట్ల గ్రౌండింగ్ జరగాలన్నారు. పారిశ్రామిక వాడల్లో కేటాయించిన స్థలాల్లో యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాప్తాడులో స్థాపించే యూనిట్లకు ప్రగతి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజరావు, డీటీసీ వీర్రాజు, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏపీఐఐసీ జెడ్ఎం సోని, ఎఫ్ఏపీసీసీఐ శేషాంజినేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు యూనిట్లకు సబ్సిడీ మంజూరు

- ఇండస్ట్రియల్ పాలసీ 2015-20కు సంబంధించి 9 యూనిట్లకు రూ.83.69 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు.
- 2020-23 ఇండస్ట్రియల్ పాలసీకి సంబంధించి 8 యూనిట్లకు రూ.69.78 లక్షలు, 'జగనన్న బడుగు వికాసం' కింద ఒక యూనిట్‌కు రూ.12.79 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు.

'డాక్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోండి



అనంతపురం సిటీ: తపాలా శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 21న డాక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ అనంతపురం డివిజన్ పీఆర్ఓ పాటిల్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఫిర్యాదులను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, అనంతపురం డివిజన్, అనంతపురం-515001 చిరునామాకు ఈ నెల 19 లోగా పోస్ట్ కవర్‌లో పంపాలన్నారు. పోస్టు కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలని ఆయన సూచించారు. 21న ఉదయం 11 గంటలకు డాక్ అదాలత్‌కు ఫిర్యాదుదారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

అధినేత రాక.. ఏర్పాట్లు చకచకా!



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 18న రాప్తాడు రానున్నారు. స్థానిక ఆటోనగర్ సమీపాన నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. గురువారం సభాస్థలిని సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు(విద్య) ఆలూరి సాంబశివా రెడ్డి పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు రాజారాం, పామిడి వీరాంజనేయులు, పెన్నోబులేష్, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహా రెడ్డి, అంజి, రామలింగమయ్య, బుడగ నాగరాజు, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మళ్లీ జగనన్నదే జైత్రయాత్ర

అనంతపురం కార్పొరేషన్: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడం ఖాయమని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై. రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో జగనన్న జైత్రయాత్ర మరోసారి కొనసాగనుందని స్పష్టం చేశారు. గురువారం 'యాత్ర-2' సినిమా విడుదల సందర్భంగా నగరంలో ఐటీ వింగ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ రీజినల్ కో ఆర్డినేటర్ సుధీర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, నాయకులు సుబ్బ రాయల్, చంద్రమోహన్, శ్యాం, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నరేంద్ర రెడ్డి, కో కన్వీనర్ బ్రహ్మారెడ్డి, వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ మాస్కులు ధరించి ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ సభ్యులు

అకౌంట్ టెస్టులకు దరఖాస్తు చేసుకోండి

- ఎస్ఏలకు డీఈఓ సూచన

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు అవసరమైన అకౌంట్ టెస్టుల కోసం స్కూల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పేపర్-1, పేపర్-2 పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. www.bse. ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17 వరకు గడువు ఉంటుందన్నారు. రెండు పేపర్లకు రూ.150, ఒక పేపరుకు రూ. 100 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. పరీక్ష రుసుం గేట్‌వే ద్వారానే చెల్లించాలన్నారు. రూ.60 అపరాధ రుసుంతో ఈనెల 22 వరకు చెల్లించవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 23లోగా కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు పరీక్షల విభాగంలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

'ఉద్యోగుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్'



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తున్న కోదండరామిరెడ్డి (ఫైల్)

ఉరవకొండ: ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తన సమస్యకు చక్కటి పరిష్కారం చూపి తాను ఉద్యోగుల పక్షపాతినని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారని, ఆయన చొరవకు తాను కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. గత నెల 23న ఉరవకొండలో ఆసరా నాల్గో విడత నిధుల విడుదలకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌ను ఆయన కలసి ఐదేళ్లుగా తనకు అందాల్సిన అలెవెన్స్‌లు, రెగ్యులైజేషన్ సర్వీసుపై వినతి పత్రం అందించి, సమస్య పరిష్కారానికి సహకరించాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీఎం వైఎస్ జగన్ కేవలం 15 రోజుల్లోనే అడిషనల్ సెక్రటరీ భరత్‌గుప్తా ద్వారా తనకు న్యాయం జరిగేలా చొరవ తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. సీఎం చేసిన మేలును తాను జీవితాంతం మరిచిపోలేనన్నారు. తన కుటుంబం మొత్తం సీఎంకు రుణపడి ఉంటుందన్నారు.

బండూరు విద్యార్థి కడపలో ఆత్మహత్య



అరుణ్‌కుమార్ (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని బండూరు గ్రామానికి చెందిన లక్ష్మి, అమరేష్ దంపతుల పెద్ద కుమారుడు అరుణ్‌కుమార్ (20) కడపలో గురువారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. కడపలోని అన్నమాచార్య కళాశాలలో అరుణ్‌కుమార్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

జల్సాలు చేసేందుకు నేరాలు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- 24 ద్విచక్ర వాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం: జల్సాలకు అలవాటు పడిన కొందరు యువకులు తమ అవసరాలు తీర్చుకునేందుకు నేరాల బాటపట్టారు. పార్కింగ్ స్థలాల్లో నిలిపిన వాహనాలను అపహరించుకెళ్లి, విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, 24 ద్విచక్ర వాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు.

అంతర్రాష్ట్ర దొంగలుగా మారి...

అనంతపురంలోని నాల్గో రోడ్డుకు చెందిన నరేష్, ధర్మవరం పంగల్‌రోడ్డు సమీపంలోని తిరుమల డెయిరీ సమీపంలో నివాసముంటున్న మహేంద్ర, ఇటుకలపల్లికి చెందిన నానికుమార్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు... మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారారు. ఈ క్రమంలో తమ జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం వాహనాల చోరీకి తెరలేపారు. ఆర్టీసీ బస్టాండ్, సర్వజనాస్పత్రి, తదితర రద్దీ ప్రాంతాల్లో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళం సాయంతో అపహరించుకెళ్లి, తక్కువ ధరకు విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు తీర్చుకునేవారు. ఏడాదిన్నర కాలంలో అనంతపురం టూటౌన్, త్రీ టౌన్, తాడిపత్రి, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, బత్తలపల్లి, కర్ణాటకలోని బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో వీరు ద్విచక్ర వాహనాలు అపహరించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువులో ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను అపహరించి కళ్యాణదుర్గంలో తక్కువ ధరకే విక్రయించారు. వాహనాల దొంగతనం కోసం ఎక్కడికి వెళ్లాలనుకున్నా వీరు అద్దె కారును వినియోగించేవారు. ద్విచక్ర వాహనాల చోరీ కేసుల దర్యాప్తును ఛాలెంజ్‌గా స్వీకరించిన ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు అనంతపురం సీసీఎస్, టూటౌన్ సీఐలు ఇస్మాయిల్, వెంకటేష్‌నాయక్, జనార్ధన్, క్రాంతికుమార్, ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ బయన్న, శ్రీనివాసులు, తిరుమలేష్, కానిస్టేబుళ్లు రంజిత్, శ్రీధర్ ఫణి, వన్నూరు, దాస్, ఆసీఫ్ ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. అందిన పక్కా సమాచారంతో గురువారం ఉదయం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం 24 ద్విచక్ర వాహనాలు, ట్రాలీతో కూడిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.21 లక్షలు ఉంటుంది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు మైనర్లను జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక...

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ద్విచక్ర వాహనాల దొంగగా మారిన యువకుడిని కళ్యాణదుర్గం అర్బన్ పోలీసులు అరెస్ట్ చేసి, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని అనంతపురంలోని చంద్రబాబు నగర్‌కు చెందిన పోతుల జాన్‌గా గుర్తించారు. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఇబ్బంది పడుతున్న తనను వడ్డీ వ్యాపారులు తీవ్రంగా వేధిస్తుండడంతో ద్విచక్ర వాహనాలు అపహరించి, సొమ్ము చేసుకుని అప్పులు తీర్చాలని భావించినట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఈ క్రమంలో ఐదు రకాల కంపెనీలకు చెందిన ద్విచక్ర వాహనాల నకిలీ తాళాలను సేకరించి, రెండు నెలలుగా కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రిలో పార్కింగ్ చేసిన ఐదు వాహనాలను అపహరించుకెళ్లినట్లు వివరించాడు. వీటిపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో అనంతపురంలోని బైపాస్ వద్ద మారుతీ వే బ్రిడ్జి వద్ద తచ్చాడుతున్న పోతుల జాన్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.5 లక్షలు విలువ చేసే ఐదు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన, అనంతపురం, కళ్యాణదుర్గం పోలీసులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

సౌకర్యాల కల్పనకు కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఓ వై.భద్రాజీ

గుంతకల్లు: భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయాభివృద్ధికి చర్యలు చేపడతామని ఆలయ ఈఓ వై.భద్రాజీ పేర్కొన్నారు. ప్రస్తుతమున్న ఆలయ డీసీ నెల్లూరు జిల్లా పెనుసలలోని పెనుసల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి బదిలీ కాగా ఆయన స్థానంలో భీమవరంలోని మువ్వళ్లమ్మ దేవస్థానం ఏఈఓగా ఉన్న వై.భద్రాజీకి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన గురువారం కసాపురం ఆలయ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఏఈఓ మల్లికార్జున, వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

రైతుపై హిజ్రాల దాడి



గాయపడిన చిత్తయ్య

కళ్యాణదుర్గం రూరల్: హిజ్రాల దాడిలో ఓ రైతు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం తిమ్మగానిపల్లికి చెందిన రైతు చిత్తయ్య బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గానికి బయలుదేరాడు. మల్లాపురం రోడ్డు సమీపంలోకి చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ల వద్ద చిత్తయ్య వాహనాన్ని హిజ్రాలు అడ్డుకుని దాడికి తెగబడి జేబులోని రూ.2వేలు లాక్కొన్నారు. దాడిలో తలకు తీవ్ర గాయమైన చిత్తను అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. అనంతపురానికి చెందిన కొందరు డ్యాంను చూసేందుకు కారులో వచ్చారు. తిరుగు ప్రయాణంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఆ సమయంలో మంటలు ఎగిసిపడడంతో ద్విచక్ర వాహనం వద్ద ఉన్న కణేకల్లు మండలం జక్కలవడికి గ్రామానికి చెందిన సతీష్, హనుమాపురం నివాసి రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ప్రైవేట్ వాహనంలో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రులిద్దరూ అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతూ ఘటనాస్థలం వద్ద రోడ్డు పక్కన ఆగినట్లు సమాచారం. ఘటనపై కూడేరు పోలీసులు దర్యాప్తుచేపట్టారు.

రోడ్డు స్కేటింగ్ విజయవంతానికి సహకారం



రమణ మహర్షి అనాథ ఆశ్రమ విద్యార్థులతో కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'ఆడపిల్లలను చదివిద్దాం – ఆడపిల్లలను రక్షిద్దాం, ప్లాస్టిక్ కవర్లను నిషేదిద్దాం – భూగర్భ జలాలను కాపాడుదాం, అనాథలను ఆదరిద్దాం – బాల కార్మిక వ్యవస్థను నిరోదిద్దాం' అనే నినాదాలతో ప్రజలను చైతన్యపరిచేందుకు తాడిప్రతిలోని రమణ మహర్షి అనాథ ఆశ్రమ విద్యార్థులు చేపట్టిన రోడ్డు స్కేటింగ్‌ను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ గౌతమి అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 750 కిలోమీటర్ల రోడ్డు స్కేటింగ్ చేపట్టిన విద్యార్థులను గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె అభినందించారు. ఆశ్రమ కార్యదర్శి రమణ మహేష్, స్కేటింగ్ కోచ్ మధు మాట్లాడుతూ.. ఆశ్రమ విద్యార్థులు ఏడుగురు ఈ నెల 12న తెల్లవారుజాము 5గంటలకు తాడిపత్రి నుంచి బయలుదేరి గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, అనంతపురం, లేపాక్షి, హిందూపురం, మడకశిర, ధర్మవరం మీదుగా తాడిపత్రికి చేరుకుంటారన్నారు. తమ మార్గంలోని ప్రతి గ్రామం, పట్టణాల్లో ఆడపిల్లల సంరక్షణ, ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలను చైతన్య పరుస్తారన్నారు. మొత్తం ఈ ప్రక్రియ ద్వారా వజ్ర వరల్డ్ రికార్డు, హిందుస్తాన్ రికార్డు, ఏషియన్ కాంటినెటల్ రికార్డు, వజ్ర నేషనల్ రికార్డును నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కేటింగ్ సౌత్ జోన్ కార్యదర్శి బి.ప్రతాప్, విద్యార్థులు ఇషాక్, యోగేంద్ర, పృథ్వీ, రామ్‌చరణ్, భార్గవ, శ్రీరామ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ అధికారులకు అదనపు బాధ్యతలు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న ఎనిమిది మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు చూస్తున్న ఈఓలు, ఈఓఆర్‌డీలకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎనిమిది మండలాలకు ఎంపీడీఓల కొరత ఏర్పడింది. దీంతో పాలనా సౌలభ్యం కోసం ఆయా మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్న పరిపాలనా అధికారులు, ఈఓఆర్‌డీలకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ చర్యలు తీసుకున్నారు. అదనపు బాధ్యతలు స్వీకరించే వారిలో ఎస్.అశోక్‌కుమార్ (అమడగూరు), వీవీ సిద్దారెడ్డి (కొత్తచెరువు), ఎల్.రామ్‌కుమార్ (చిలమత్తూరు), డాక్టర్ పీకే కేశవరెడ్డి (రొద్దం), ఆర్‌వీవీజీ ప్రసాద్ (రొళ్ల), డి.విజయమ్మ(బొమ్మనహాళ్), ఎం.గూడెన్న (కణేకల్లు), ఎం.వెంకటలక్ష్మమ్మ (గార్లదిన్నె) ఉన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సహకరించండి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



సమస్యలపై తండావాసులతో ఆరా తీస్తున్న వడిత్యా శంకర్ నాయక్

ఆత్మకూరు: గిరిజనుల అభ్యున్నతికి సహకరించాలని అధికారులకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ సూచించారు. గురువారం ఆత్మకూరు మండలం సింగంపల్లి తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా గిరిజనులకు రాజ్యాంగ పరమైన హక్కులను కల్పించేందుకు ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ క్రమంలో కమిషన్ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకూ అధికారులు చక్కటి పరిష్కారం చూపుతుండడం అభినందనీయమన్నారు. గిరిజనుల అభ్యున్నతిని గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డీపీడీ ద్వారా రూ.2 లక్షల 63 వేల కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ హయాంలో గిరిజనుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు ఖర్చు పెడితే... జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏకంగా రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టారని గుర్తు చేశారు. మారుమూల ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారు తీవ్ర అనారోగ్యం పాలైతే ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల మేర ఉచితంగా వైద్య సేవలు అందుకునే వెసులుబాటును కల్పించడం చరిత్రాత్మకమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత గొప్ప పథకం లేదన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా గిరిజనుల అభ్యున్నతికి అధికారులూ సహకరిస్తూ అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సింగంపల్లి తండాలో శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్టీ కమ్యూనిటీ హాల్, కొత్త ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. రూ.60 లక్షలతో మంజూరైన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎస్టీ కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. సింగంపల్లి తండా నుంచి కూడేరుకు వెళ్లే రహదారి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే సాగు చేస్తున్న అటవీ భూములకు సంబంధించి ఆయా ఎస్టీ రైతులను గుర్తించి పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్, తహసీల్దార్ పరమేశ్వరస్వామి, ఎంపీడీఓ దశరథరాముడు, సర్పంచ్ వెంకటేష్‌నాయక్, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తాగునీటి పథకం కార్మికులు

- ఫలించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ కృషి



కార్మికులతో చర్చలు జరుపుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరారు. పది రోజులుగా తాగునీరు అందకపోవడంతో ఉరవకొండ వాసులు పడుతున్న ఇబ్బందులను గమనించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి వెంటనే స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌తో పాటు డీఈ అంజుమన్ సత్రీన్, కాంట్రాక్టర్ మహనంద రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో గురువారం ఉదయం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయంలో కార్మికులతో చర్చలు జరిపారు. డిమాండ్ల పరిష్కారానికి కాంట్రాక్టర్ ఆమోదం తెలపడంతో తాము సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు ప్రకటించి, విధుల్లో చేరారు. చర్చల్లో ఈఈ, డీఈ, కాంట్రాక్టర్‌తో పాటు ఏఈఈలు ఫామీదాబేగం, ద్రాక్షయాణి, ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వైఎస్సార్‌సీపీ మండల సమన్వయకర్త ఓబన్న, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, నాయకులు ఉలిగన్న, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.14 లక్షల చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న రైల్వే అధికారులు

గుత్తి: స్థానిక బీసీ కాలనీల నివాసముంటున్న రైల్వే ఎలక్ట్రికల్ ఉద్యోగి షెక్షావలి ఐదు రోజుల క్రితం పాతకొత్తచెరువు వద్ద విధులు నిర్వర్తిస్తూ కరెంట్ షాక్ గురై, కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఆర్ఎం వినీత్ సింగ్ చొరవ తీసుకుని మృతి అనంతరం షెక్షావలికి అందాల్సిన రూ.14 లక్షలు మంజూరు చేయించారు. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో 1మృతుడి భార్య భానుకు సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మీనాకుమారి తదితరులు గురువారం రాత్రి అందజేశారు. ఇతర బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా కూడా త్వరలోనే మంజూరవుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

యల్లనూరు: మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన మల్లప్ప కుమారుడు శేఖర్‌బాబు అలియాస్ షెక్షావలి (45) విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం సాయంత్రం తనకున్న రెండెకరాల పొలంలోని తోటలోని చెట్లకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృత్యువాతపడినట్లు భార్య సోనియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్ఐ గిరిబాబు దర్యాప్తు చేపట్టారు.


రాయదుర్గంలో జీడిపల్లి వాసి మృతి




మృతుడు సిద్దప్ప

రాయదుర్గం టౌన్: స్నేహితుడి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వచ్చిన వ్యక్తి మరుసటి తెల్లవారే సరికి గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం జీడిపల్లికి చెందిన కురుబ సిద్దప్ప (60) బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై రాయదుర్గానికి వచ్చాడు. ఇటీవల మృతి చెందిన తన స్నేహితుడు చాకలి చంద్ర కుటుంబసభ్యులను పరామర్శించి, చీకటి పడడంతో ఆ రాత్రికి అక్కడే నిద్రించి, మరుసటి రోజు ఉదయం స్వగ్రామానికి వెళ్లిపోతానని అభ్యర్థించాడు. తమకు ఇష్టం లేకపోయినా... తప్పని పరిస్థితుల్లో చంద్ర భార్య, కుమారుడు అంగీకరించారు. రాత్రి భోజనం చేసి నిద్రపోయిన సిద్దప్ప గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయాన్ని గుర్తించిన చంద్ర కుటుంబసభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనై వెంటనే విషయాన్ని కొందరు పెద్దలు, పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న జీడిపల్లిలోని కుటుంబసభ్యులు రాయదుర్గంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న ఎంపీసీ లే అవుట్‌కు చేరుకుని సిద్దప్ప మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సిద్దప్ప భార్య, ఇద్దరు కుమారులు మాట్లాడుతూ.. చెప్పాపెట్టకుండా ఊరు విడిచి వెళ్లడం సిద్దప్పకు అలవాటన్నారు. ఆయన మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రేపటి నుంచి అశ్వత్థం తిరునాల



చక్రభీమలింగేశ్వర స్వామి మూలవిరాట్



కట్టపై వెలసిన శింగరబట్టు, గణపతి, అశ్వత్థనారాయణ స్వామి విగ్రహాలు

పెద్దపప్పూరు: దక్షిణ కాశీగా ఖ్యాతి గాంచిన పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఈ నెల 9 నుంచి ఐదు ఆదివారాల పాటు తిరునాల నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పాలక మండలి చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం గురువారం వెల్లడించారు.. తిరునాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననుండడంతో పటిష్ట ఏర్పాట్లు చేశారు. 11, 18, 25, మార్చి 3, 10 తేదీల్లో జరిగే తిరునాలకు తాడిపత్రి, ముచ్చుకోట, కొండాపురం, నార్పల, ధర్మవరం, బనగానపల్లి, గుత్తి, యాడికి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు.

'చంపుతామని బెదిరిస్తున్న టీడీపీ నాయకులు'

యాడికి: ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో తమను చంపుతామంటూ యాడికి మండలంపుప్పాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విజయప్రభాకర్, గంగిరెడ్డి, చరణ్ బెదిరిస్తునానరని అదే గ్రామానికి చెందిన లక్ష్మీరంగారెడ్డి, రమణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి ఫుల్‌గా మద్యం సేవించిన వారు రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి రాగానే చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. బుధవారం యాడికిలో జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రలో మద్యం ఏరులై పారింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చెంచు విజయప్రభాకర్, గంగిరెడ్డి, చరణ్ ఫుల్‌గా మద్యం సేవించి అదే రోజు రాత్రి 11 గంటలకు పుప్పాలకు చేరుకున్నారు. నేరుగా బాధితుల ఇంటి వద్దకు చేరుకుని కట్టెలతో దాడికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తూ మరో రెండు నెలల్లో అందరినీ చంపేస్తామంటూ బెదిరింపులకు దిగారు. తమకు టీడీపీ నాయకుల నుంచి ప్రాణహానీ ఉందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఈ సందర్భంగా పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి ఏపీ జూనియర్స్ ఉమెన్ హాకీ టోర్నీ



క్రీడాకారులతో హాకీ జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ అనిల్‌కుమార్

అనంతపురం: ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ శ్రీకాకుళం వేదికగా 14వ ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ ఉమెన్ హాకీ చాంపియన్‌షిప్ టోర్నీ జరుగనుంది. టోర్నీలో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించే జట్టుకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం అనంత క్రీడాగ్రామంలో ముగిసింది. జట్టులో చోటు దక్కించుకున్న వారిలో టి.నందిని (కెప్టెన్), సి.మల్లిక, పి.లక్ష్మి, ఎం.మైథిలి, జి.సాయిభవ్య, ఎ.వర్షిణి (గోల్ కీపర్), ఎ.మనోజ్ఞ, టి.భావన, యు.స్వీటి, ఎం.భాను తేజస్విణి, సి.మంజూష, ఎం.షాలిని, ఎస్.సమీరా, జి.భవ్యశ్రీ, ఎస్.హనీ, ఆరీఫా ఉన్నారు. క్రీడాకారులకు టీ- షర్టులు, షార్ట్స్‌ను ఇన్ఫినిటి చారిటబుల్ ట్రస్ట్ (కళ్యాణదుర్గం) ఫౌండర్ బద్దే నాయక్ అందజేశారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ ఎస్.అనిల్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎంఎస్ అక్రమ్‌బాషా, కోచ్ శంకర్, టీం కోచ్ ఆర్.దేవకి, మేనేజర్ బి.అఖిల పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు పక్కా ఆస్తి

- శరవేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్
- శాశ్వత హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు
- 74 సచివాలయాల్లో ప్రారంభమైన సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేసింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఇళ్ల స్థలాలు ఇచ్చిన అక్కచెల్లెమ్మలకు స్థలాలపై సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇటీవల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని జీఓ విడుదల చేసింది. వార్డు అడ్మిన్/పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. అనంతపురం అర్బన్‌లోని 74 సచివాలయాల పరిధిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.

వీఆర్‌ఓలు, అడ్మిన్లకు బాధ్యతలు..

నగరంలోని 50 డివిజన్ల పరిధిలోని 74 సచివాలయాల్లో 29,583 మందికి ఆలమూరు, కొడిమి, కురుగుంట ఏ, బీ, సీ, డీ, పండమేరు, రాచానపల్లి, సిద్దరాంపురం, ఏ, బీ, సీ, డీ, తాటిచెర్ల పాదరాళ్ల, ఉప్పరుపల్లి ఏ, సీ, డీ, కామారుపల్లి మొత్తం 18 లే అవుట్లలో ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించింది. వీటిలో 14,210 లబ్ధిదారులను మ్యాపింగ్ చేసి, 11,978 మందికి స్థలాలకు బౌండరీలను ఫిక్స్ చేసేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా కామారుపల్లి స్థలం లబ్ధిదారులకు మరో అనువైన ప్రాంతంలో స్థలం కేటాయించనున్నారు. ప్రస్తుతం 14,210 ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. సచివాలయాల్లో అడ్మిన్, వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లను వేగవంతం చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే 300 ఇళ్లకు పట్టాలకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇక మిగతా వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.



9వ సచివాలయంలో ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నగరపాలక సంస్థ	అనంతపురం
డివిజన్లు	50
సచివాలయాలు	74
రిజిస్ట్రేషన్ చేయనున్న పట్టాలు	14,210
ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తి	300

6 మంది స్పెషలాఫీసర్లు..
35 మంది నోడల్ ఆఫీసర్లు

నగరపాలక సంస్థ కమిషనర్ వై.మేఘ స్వరూప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు 6 మంది స్పెషలాఫీసర్లు, 35 మంది నోడల్ ఆఫీసర్లను నియమించారు. ప్రతి రెండు మూడు సచివాలయాలను నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షించనున్నారు. ఎప్పటికప్పుడు సచివాలయానికి వెళ్లి సిబ్బంది పనితీరుపై ఆరా తీయనున్నారు.

త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అర్బన్‌లో 14,210 మంది లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నాం. రెవెన్యూ శాఖ సమన్వయంతో సచివాలయ అడ్మిన్, వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.



సాధ్యమైనంత త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వై.మేఘస్వరూప్, కమిషనర్

క్లుప్తంగా

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, యల్లనూరు ప్రసాద్ పేర్కొన్నారు. కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న తమకు ఆర్థికంగా బలోపేతం చేయడానికి పథకాలు అందించడంతోపాటు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. గురువారం బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు అన్నివిధాలా అండగా నిలిచారన్నారు.

నివాళి



తిరుమలరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు తిరుమల రెడ్డి (87) బుధవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి గురువారం ఆత్మకూరుకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుమలరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, మదిగుబ్బ చిన్నపరెడ్డి, శ్రీరామిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యత



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీ జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు

అనంతపురం రూరల్: మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని నిర్మించుకుందామని ఏపీ జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు రఫీ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నివారణపై ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకూ ఏపీ జమాతే హింద్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్రస్థాయి ఉద్యమానికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల ఎంతో మంది యువత జీవితాలు అంధకారంలోకి వెళుతున్నాయన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నవాజ్ అహ్మద్, సభ్యులు యాసీర్, ముజరఫ్, జిలాన్, హాజీపీరా, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని హిజ్రా దుర్మరణం

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రైలు ఢీకొని గుర్తు తెలియని హిజ్రా (40) మరణించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ట్రాక్ దాటుతున్న క్రమంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించినట్లు వివరించారు. అయితే మరణించిన హిజ్రా పూర్తి వివరాలు తెలియరాలేదని, ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించామన్నారు.

రాజకీయంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ జిల్లా జడ్జి కిష్టప్ప

అనంతపురం టవర్‌క్లాక్: బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా అభివృద్ధి చెందితే ఆ కులాలకు న్యాయం జరుగుతుందని రిటైర్డ్ జడ్జి కిష్టప్ప అన్నారు. గురువారం స్థానిక ఆలేఖ్య ఫంక్షన్ హాలులో ఆల్ ఇండియా ప్రజా సేవా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 7వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు జడ్జి కిష్టప్ప మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు ఓటు అనే హక్కుతో సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కులాల్లో బలమైన వారిని రాజకీయంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రజా సేవా హక్కుల సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాధవ్, ప్రజా సంఘాల నాయకులు మధు, ఐఎంఎం వ్యవస్థాపక అధ్యక్షులు మహబూబ్ బాషా, పీఆర్‌ఎస్‌ఎస్ నాయకులు శ్రీరాములు, జన సంఘం కుల్లాయప్ప, సాకే హరి, ఎంఎండీ ఇమామ్, ఆర్‌కే రాజు, దంపెట్ల శివ, డాక్టర్ కుల్లాయప్ప, తరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వైద్యాధికారి శివకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి సకాలంలో వైద్య సేవలు అందాలన్నారు. అలాగే ఈనెల 9, 16 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులతో మింగించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణమ్మ, నరసింహ పాల్గొన్నారు.

మార్చి 3న మహాజన సభ

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా శాఖ పరస్పర సహకార సంఘం మహాజన సభ మార్చి 3వ తేదీన అనంతపురంలో నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి బి.హర్షవర్దన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం శ్రీనివాసనగర్‌లోని తమ శాఖ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

అనంతపురం కార్పొరేషన్: ఇంటి, నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని రెవెన్యూ విభాగం సిబ్బందిని కమిషనర్ వై.మేఘ స్వరూప్ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలో రెవెన్యూ విభాగం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి, నీటి పన్ను డిమాండ్, అరియర్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్‌ల నుంచి వచ్చే ఆదాయం, వాటి పరిస్థితిపై ఆరా తీశారు. ఇప్పటికే కొత్తూరు షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ లోపాలు తన దృష్టికి రావడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా జాప్యం చేస్తున్న వారి జాబితా సిద్ధం చేయాలన్నారు. గతేడాదితో పోల్చితే పన్ను వసూళ్లలో వెనుకబడ్డారని, దీనిపై వార్డు అడ్మిన్ కార్యదర్శులు, ఆర్‌ఐల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యం ఏర్పరుచుకుని పన్ను వసూళ్లు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌ఎఓలు సుజాత, సతీష్‌కుమార్, ఆర్‌ఐలు మురళీ, బాబు, పద్మావతి, సూపరింటెండెంట్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

నేడు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 48వ డివిజన్ సోమనాథ్ నగర్ రామాలయం నుంచి శుక్రవారం ఉదయం 7:30 గంటలకు 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమం మొదలై రజకనగర్ వరకూ కొనసాగుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు రవూఫ్ వర్ధంతి

అనంతపురం సిటీ: కదిరి సమీపంలోని కుటాగుళ్లలో శుక్రవారం విప్లవ యోధుడు, మావోయిస్టు ఉద్యమ నిర్మాత ఎస్ఏ రవూఫ్ వర్ధంతి నిర్వహించనున్నట్లు ఎస్ఏ రవూఫ్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి పి.మహమ్మద్ అలీఖాన్ గురువారం తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం

అనంతపురం కార్పొరేషన్: పేదల సొంతింటి కల సాకారం చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జరుగుతోందని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరంలోని 61వ వార్డు సచివాలయంలో పేదలకు అందించిన ఇళ్ల స్థలాలను వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి మేయర్ వసీం పరిశీలించారు. ఓ లబ్ధిదారురాలికి ఇంటి పట్టా డాక్యుమెంట్‌ను అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటిపై సర్వహక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరంలో 24 వేలకు మందికిపైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు సచివాయాలకు వెళ్లి ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు రహంతుల్లా, సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.



61వ సచివాలయ పరిధిలో మహిళకు రిజిస్ట్రేషన్ పత్రం అందజేస్తున్న మేయర్ వసీం

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సెక్యూరిటీ సిబ్బంది క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఎస్పీ ప్రసాద రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రభుత్వ వైద్యుల సంఘం సమావేశం హాల్‌లో సెక్యూరిటీ సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహించారు. మొత్తం 140 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉంటే పట్టుమని 50 మంది కూడా శిక్షణ తరగతులకు హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వంద మందికి పైగా సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా..ఆస్పత్రిలో ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు ఎందుకు చోరీ అవుతున్నాయో చెప్పాలన్నారు. ముఖ్యంగా సెక్యూరిటీ సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రధానంగా సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిపై పోలీసుల నిఘా ఉంటుందన్న విషయాన్ని మరువద్దన్నారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు సరిగా లేవని, పూర్తి స్థాయిలో మంచి రెసల్యూషన్ కెమెరాలు ఏర్పాటు చేయించేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుకు సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మరింత నిఘా పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. టూటౌన్ సీఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని పేద ప్రజలకు దిక్కు సర్వజనాస్పత్రి అని, పేదలతో ప్రేమగా మాట్లాడి వారికి మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్, పోలీసు సంఘం అధ్యక్షుడు త్రిలోక్, ఏఎస్ఐ రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

'రైపర్'లో అంతర్జాతీయ సదస్సు



కొరియన్ ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: రాఘవేంద్ర ఫార్మసీ కళాశాల (రైపర్)లో 'ఔషధ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ప్రాముఖ్యత' అనే అంశంపై గురువారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కొరియా నుంచి ప్రొఫెసర్ సుశృత, ప్రొఫెసర్ స్పందన హాజరయ్యారు. ప్రొఫెసర్ సుశృత నూతన ఔషధాల ఆవిష్కరణలో కృత్రిమ మేధ ప్రాముఖ్యతను వివరించారు. ప్రొఫెసర్ స్పందన 'కొరియన్ జిన్ సెంగ్' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పద్మనాభ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కే.వినోద్ కుమార్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ కే.సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

అనంతపురం సెంట్రల్: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా వాహనాలు నడపాలని ఆర్టీఓ సురేష్‌నాయుడు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డీటీసీ వీర్రాజు ఆదేశాల మేరకు గురువారం రవాణాశాఖ కార్యాలయంలో రహదారి భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ప్రజా రవాణాలో ఆటోలు కూడా కీలకంగా మారాయని తెలిపారు. అయితే డబ్బు సంపాదన కోసం చాలా మంది నిబంధనలు పాటించడం లేదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అతివేగంగా నడపడం, ఓవర్‌లోడింగ్ వల్ల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఇలాంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందని వివరించారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టి పెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని విధంగా 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, ఇన్సూరెన్స్‌లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, రమణారెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీఓ సురేష్ నాయుడు

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు

ఆత్మకూరు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ఎంపీడీఓ దశరథరామయ్య, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. తలుపులు, బెంచీలు, మరుగుదొడ్లు, వికలాంగులు వస్తే ఓటు వేయడానికి అనుకూలంగా ర్యాంప్ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

రాప్తాడు: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీడీఓ ఆర్.గీతావాణి పేర్కొన్నారు. గురువారం రాప్తాడు, గంగలకుంట, అయ్యవారిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సదుపాయం, తాగు నీరు, ర్యాంపు, ఫ్యాన్లు, ఫర్నిచర్, తలుపులు, కిటికీలు తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగంపల్లి తండా పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న అధికారులు

హక్కుల సాధనకు పోరాటం

అనంతపురం అర్బన్: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాలని ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జగ్గుల స్వతంత్రకుమారి అన్నారు. మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ మధు, వీఎహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు. స్వతంత్రకుమారి మాట్లాడుతూ మహిళ రక్షణ కోసం నిర్దేశించిన చట్టాలను ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను రానున్న ఎన్నికల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు జయమ్మ, లక్ష్మీదేవి, హుసేన్‌బీ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

అనంతపురం: చిత్తూరులోని విజ్ఞాన సుధ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 15న రాయలసీమ స్థాయి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్. ఆనంద్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 100కు పైగా కంపెనీలు పాల్గొంటాయన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8374421195, 8142509017, 6300954441 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

బైబిల్ క్విజ్-2024 విజేతలకు బహుమతులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసు కృపా మందిరంలో గురువారం అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 44వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఇడుపులపాయ బైబిల్ టీచరు డాక్టర్ కె.నరేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత జనవరి 15న నిర్వహించిన బైబిల్ క్విజ్-2024 విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి దేశి రాజేంద్ర (హైదరాబాద్)కు డాక్టర్. కె. నరేష్ బాబు చేతల మీదుగా రూ.30 వేలు, రెండో బహుమతి మనోజ్ కుమార్, (వరంగల్)కు అసోసియేషన్ గౌరవ సలహాదారులు రెవరెండ్ వీరేష్ చేతులమీదుగా రూ.15 వేలు, మూడో బహుమతి ఆశ్రిత మేరీకి (అనంతపురం) గౌరవ సలహాదారులు చల్లా కిషోర్ చౌదరి చేతుల మీదుగా రూ.7,500 అసోసియేషన్ తరపున అందజేశారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు. పాస్టర్ పి.మార్క్, కార్యదర్శి పాస్టర్ జీఆర్ ఆనంద్, జాయింట్ కార్యదర్శి రెవ వి.మనష్షే, ట్రెజరర్ పాస్టర్ కె.జీవన్ బాబు, సభ్యులు పాస్టర్ ఎం.రూఫస్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

అనంతలో యాత్ర-2 జోష్



యాత్ర-2 సినిమాలో ఓ సన్నివేశం



వైఎస్ జగన్ మాస్కులతో అభిమానుల సందడి

అనంతపురం కల్చరల్/అనంతపురం కార్పొరేషన్/కనగానపల్లి: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం జగన్ చేపట్టిన పాదయాత్రల ఆధారంగా తీసిన యాత్ర-2 సినిమా గురువారం విడుదలైంది. నగరంలోని పలు థియేటర్ల వద్ద వైఎస్సార్ అభిమానులు, నాయకులు, ప్రజలు సందడి చేశారు. పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, జయహో వైఎస్సార్, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం జగన్ మాస్కులు ధరించిన అభిమానులు థియేటర్లలో కేరింతలు కొట్టారు. వైఎస్సార్ పాత్రలో ముమ్మట్టి, వైఎస్ జగన్ పాత్రలో జీవా అద్భుతంగా నటించి ఆకట్టుకున్నారు. వైఎస్సార్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన దృశ్యాలు, రాజశేఖరరెడ్డి మరణానంతరం కుటుంబాన్ని రోడ్డుకీడ్చడం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ అభిమాన నేత మరణాన్ని తట్టుకోలేక విలపించిన సన్నివేశాలు కంటతడి పెట్టించాయి. కార్యక్రమంలో మేయర్ వసీం, కార్పొరేటర్లు కమల్‌భూషన్, సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, మారుతీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సినిమా చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

రుణాలు మాఫీ చేయాలి

అనంతపురం అర్బన్: రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడారు. గత ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపటాలన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. అదే విధంగా రైతుల పంట రుణాలను రూ.2 లక్షల వరకూ మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నప్ప యాదవ్, చిరుతల మల్లికార్జున, నాయకులు నారాయణ స్వామి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఏపీ ఎన్జీఓ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసేందుకు సిద్ధం కావాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ హోంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 12వ పీఆర్‌సీ ప్రకటించి 6 నెలలు గడుస్తోందన్నారు. వెంటనె ఐఆర్ ప్రకటించాలన్నారు. అలాగే సరెండర్ లీవులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు బకాయిలు ఇవ్వాలన్నారు. ఈనెల 11న జరగబోవు జేఏసీ సమావేశంలో ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. 12న చీఫ్ సెక్రటరీకి ఉద్యమ నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 14 నుంచి 26 వరకూ ఉద్యమాలు చేయడానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలా బేగం, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీన్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీలు శోభరాణి, మహేష్, సిటీ కార్యదర్శి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి